క్లుప్తంగా

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తున్న భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున తోమాల, సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం కళావేదిక వద్ద శ్రీవారి భక్తులు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. కోలాటాలు, అన్నమాచార్యుల సంకీర్తనలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన దిలీప్ అనే వ్యక్తి 500 మందికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అన్నసంతర్పణను ఏఈవో జగన్మోహనాచార్యులు పర్యవేక్షించారు.

'గురువులు'కు పలువురి అభినందనలు



డీసీసీబీ చైర్మన్ కోలా గురువులును అభినందిస్తున్న రామునాయుడు

తగరపువలస: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా శనివారం ప్రమాణస్వీకారం చేసిన కోలా గురువులును భీమిలికి చెందిన పలువురు నాయకులు అభినందించారు. తగరపువలస పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు, కార్యదర్శి చిక్కాల ఉమామహేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, అప్పలనాయుడు దంపతులు, తాటితూరు సాంప్రదాయ మత్స్యకారుల సహకార సంఘం ప్రతినిధులు గురువులును కలిసి అభినందించారు.

పెండింగ్ పనుల పూర్తికి చర్యలు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం సమీపంలోని సాండ్ అండ్ సాండ్ లే అవుట్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కాలనీలో కాల్వలు, రోడ్లు తదితర పనులు పూర్తి చేసేందుకు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక చొరవతో రూ.1.70 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన పనులు సుమారు 95 శాతంపైనే పూర్తి చేశారు. ప్రస్తుతానికి గురుదత్త ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు, కాల్వ పని పెండింగ్‌లో ఉండిపోయింది. వీరు స్పందనలో కూడా ఫిర్యాదు ఇచ్చారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేటర్ సూచనల మేరకు అధికారులు శనివారం పనులు ప్రారంభించారు.

'జిరాయితీగా బంజరు, అసైన్డ్ భూములు'

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ రెవెన్యూ పాత మూలకుద్దును ఆనుకుని సర్వే నంబర్ 28, 29లోని ఆరున్నర ఎకరాల బంజరు, అసైన్డ్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు జిరాయితీగా మార్చి విక్రయించేందుకు యత్నిస్తున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. దళిత, పేద రైతులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని అడ్డుకోవాలని ఈ నెల 24న భీమిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, ఈ నెల 31న స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ ఆక్రమణ వెనుక కొందరు టీడీపీ నాయకుల కుట్ర దాగుందని, వారే రికార్డుల్లో మార్పులు చేసినట్టు బాధితులు అంటున్నారు. బంజరు, అసైన్డ్ భూములకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

మురుగుకు సరిహద్దు సమస్య



గ్రామంలోని ఓ ఇంటి ముందు నిల్వ ఉన్న మురుగునీరు



జీవీఎంసీ అధికారులు తవ్వి వదిలేసిన కాలువ

- గంభీరం పంచాయతీలో కాలువ నిర్మాణానికి ఆటంకం
- జీవీఎంసీ, పంచాయతీ అధికారుల సమన్వయలోపమే స్థానికులకు శాపం

ఆనందపురం : సరిహద్దు సమస్య ఒక వైపు, రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపం మరో వైపు వెరసి మురుగునీటి కాలువ నిర్మాణానికి పెద్ద సమస్యగా మారింది. దీనివల్ల ఎక్కడి మురుగు అక్కడే ఉండిపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని గంభీరంలో చాలా ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా ఎవరూ దృష్టి సారించడం లేదని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ పరిధికి గంభీరం పంచాయతీ సరిహద్దుగా ఉంది. విశాఖ – ఆనందపురం జాతీయ రహదారిలో గల జంక్షన్ నుంచి పడమర వైపుగా గల గంభీరం గ్రామం వరకూ ఉన్న సిమెంట్ రోడ్డుకు ఎడమ వైపు ప్రాంతమంతా జీవీఎంసీ పరిధిలోని 5వ వార్డులోను, కుడివైపు అంతా గంభీరం పంచాయతీ పరిధిలో ఉంది. ఎడమ వైపు గల ప్రదేశంలోనే పంచాయతీ కార్యాలయంతో పాటు సుమారు 50 గృహాలు కూడా ఉన్నాయి. రోడ్డు నిర్మాణం జరిగి సుమారు పదేళ్లు కావస్తోంది. అప్పట్లోనే మురుగు నీటి కాలువు నిర్మించడానికి ప్రయత్నించినా సరిహద్దు సమస్య తలెత్తడంతో పంచాయతీ పనులు చేపట్టడానికి అవకాశం లేకుండా పోయింది. అలాగని జీవీఎంసీ దృష్టి సారించిందా అంటే అదీ లేదు. దీంతో అప్పటి నుంచి అక్కడ మురుగునీటి కాలువ నిర్మించడానికి అవకాశం లేకుండా పోయింది. దీనివల్ల ఎవరి ఇంటి ముందు వారు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగునీటిని నిల్వ చేసుకునే పరిస్థితి నెలకొంది. దీంతో దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు అంటున్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇంకుడు గుంతల్లోని మురుగు పొంగి రోడ్డుపైన ప్రవహించడంతో రాకపోకలు సాగించలేకపోతున్నామని అంటున్నారు. ఈ సమస్యను స్థానికులు పలుమార్లు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా స్థలం తమ పరిధిలో లేనందున పనులు చేపట్టడానికి అవకాశం లేకుండా పోయిందని అధికారులు అంటున్నారని స్థానికులు తెలుపుతున్నారు.

తవ్వి... వదిలేశారు..

ఇక్కడ మురుగునీటి సమస్య తీవ్రతరం కావడంతో ఇటీవల ఈ విషయాన్ని వార్డు కార్పొరేటర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆ కార్పొరేటర్ రూ.5 లక్షలతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభించి 40 రోజులు కావస్తున్నా ఇంత వరకూ ప్రారంభించ లేదు. దీంతో ఇక్కడ రోడ్డు పొడవునా తవ్విన గోతులే దర్శనమిస్తున్నాయి. పరిస్థితి ఎప్పటిలాగానే ఉంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చలపతిని వివరణ కోరగా స్థలం జీవీఎంసీ పరిధిలో ఉండడంతో కాలువ నిర్మాణ పనులు చేపట్టడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. జీవీఎంసీ అధికారులతో, వార్డు కార్పొరేటర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి



తగరపువలసలో నిరసన ర్యాలీలో సీపీఐ నాయకులు

తగరపువలస: మణిపూర్‌లో మారణహోమానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి ముందుగా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నాయకులు చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్ నుంచి ప్రైవేట్ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. రెండు తెగల ప్రజల మధ్య చిచ్చు పెట్టి వారి పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న దుండగులకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల భద్రతా దళాలు ప్రేక్షకపాత్ర వహించకుండా అన్ని గ్రూపుల నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకుని శాంతి, సామరస్యాలు నెలకొల్పాలని కోరారు. ముఖ్యమంత్రితో రాజీనామా చేయించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలన్నారు. అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, తూతిక సోమరాజు, మావూరి వీర్రాజు, నూలు ఆదినారాయణ, చెల్లూరి అప్పారావు, ఎం.సన్నిబాబు, పి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పీఎం పాలెం: ఓ యువతి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... సప్ప అప్పన్న అనే వ్యక్తి వుడా కాలనీలోని అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అదే అపార్టుమెంట్లో కుమార్తె గంగ (19), భార్య సత్యవతితో కలిసి నివసిస్తున్నాడు. వీరిరువురు ఇళ్లలో పనులకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఎప్పటిలాగే కుమార్తె గంగ శుక్రవారం పనులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో చెముడు, నత్తితో బాధపడుతున్న తన కుమార్తె అదృశ్యమైందని తండ్రి అప్పన్న శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వర్షం పడితే అంతే సంగతులు..

- బురదమయంగా మారుతున్న ఇడదాసరిపేట రహదారులు
- రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న స్థానికులు



బురదమయమైన ఇడదాసరిపేట రహదారి

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఇడదాసరిపేట రహదారులు వర్షం వస్తే బురదతో నిండిపోతున్నాయి. రాకపోకలు సాగించడానికి వీల్లేక స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ గ్రామంలో మూడుచోట్ల అక్షర అపార్ట్‌మెంట్లు నిర్మించి 180 కుటుంబాలకు ప్లాట్లు అమ్మేశారు. వీటిని కొనుక్కున్నవారు బీటీ రోడ్లు లేకపోవడంతో ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో ద్విచక్ర వాహనచోదకులు ఇక్కడి గోతుల్లో పడుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ కార్పొరేట్ స్కూళ్లకు చెందిన పదుల సంఖ్యలో బస్సులు ఇటువైపు రావడంతో అంతమాత్రంగానే ఉన్న గ్రావెల్ రోడ్లు మరింతగా గోతులు పడుతున్నాయి. స్కూల్ బస్సులను అడ్డుకున్నా వాటి సిబ్బంది పట్టించుకోకుండా దౌర్జన్యాలకు దిగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత బిల్డర్లు తమ అపార్ట్‌మెంట్లకు బీటీ, సీసీ రోడ్లు నిర్మించేందుకు అప్పటి ప్రజాప్రతినిధులకు రూ.60 లక్షలు ముట్టజెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. రోడ్లు వేయకుండానే ఈ మొత్తాన్ని వారు కాజేయడంతో ఇప్పటికీ రోడ్లు లేకుండా పోయాయి. ఈ గ్రామంలో రోడ్ల కోసం ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వచ్చినట్టు ఇడదాసరిపేట గ్రామస్తులు చెపుతున్నారు.

క్లాప్ వాహనం రాకపోవడంతో వసతి గృహ బాలికలకు ఇక్కట్లు



వసతి గృహం నుంచి ట్రంకు పెట్టెలతో చెత్త మోసుకెళ్తున్న బాలికలు

తగరపువలస: చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం నుంచి బాలికలే చెత్తను ఊడ్చుకుంటూ పాత ట్రంకు పెట్టెలతో బయటకు మోసుకెళ్తున్నారు. ఇంటింటా చెత్త సేకరించే క్లాప్ వాహనాలు ఈ వసతిగృహం వద్దకు రాకపోవడంతో సేకరించిన చెత్తను ఆవరణ, రెండు రోడ్లు దాటుకుని పారబోయడానికి బాలికలు రోజూ కష్టపడుతున్నారు. ఉదయం వేళ ఈ రహదారులపై వందలాది మంది దివీస్ ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నందున బాలికలు ఇబ్బంది పడుతున్నారు. క్లాప్ వాహనం ద్వారా రోజూ వసతిగృహం నుంచి చెత్త తరలించాలని బాలికలు కోరుతున్నారు.

31 నుంచి జనంతో జనసేన

కొమ్మాది: ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ నెల 31 నుంచి జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించనున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈఎన్ఎస్ చంద్రరావు, శాకరి శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ప్రాధాన్యం



భీమిలి సీఐ రమేష్‌తో వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకే మొదటి ప్రాధాన్యమిస్తున్నట్లు సీఐ డి.రమేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ బహిరంగ మద్యపానం, బెల్ట్‌షాపుల నిర్వహణ, జూదం, మత్తు పదార్థాల విక్రయం, వినియోగం, నిల్వ వంటి సమాచారం తెలిస్తే స్టేషన్‌కు సమాచారం అందించి సహకరించాలని కోరారు. సీఐను పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, శిల్లా వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరావు, వాసుపల్లి నరేంద్ర, చేట్ల త్రినాథరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, చేట్ల కొత్తయ్యరెడ్డి, పైడి ఎల్లాజీ, చిల్లా ప్రమీల, జీరు పద్మ తదితరులు కలిశారు.

నిండుగా తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్



ఇటీవల కురిసిన వర్షాలతో నిండు కుండలా తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి శంభువానిపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న తుమ్మిరి గెడ్డ మినీ రిజర్వాయర్ నిండు కుండలా నీటితో కళకళలాడుతోంది. నిన్న మొన్నటి వరకూ అడుగంటి కళావిహీనంగా ఉన్న ఈ రిజర్వాయర్‌లోకి ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలతో కొండ కోనలు, వాగుల నుంచి నీరు వచ్చి చేరింది. దీంతో రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరిగాయి.

జలాశయంలో నీరు ఉన్నందున పీఎం పాలెం, మధురవాడ, పాత పీఎంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాల్లోని బోరు బావుల నుంచి పుష్కలంగా నీరు వస్తుందని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



దివీస్ లేబొరేటరీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

తగరపువలస: ప్రకృతి పరిరక్షణలో భాగంగా శుక్ర, శనివారాల్లో భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఉద్యోగులు 600 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కాలుష్యం కారణంగా అంతరించిపోతున్న జంతువులు, మొక్కలను కాపాడుకోవాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తే మనకు వాటి నుంచి వంద రెట్లు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ఇ.రామకృష్ణ, వైఎస్ కోటేశ్వరరావు, డీజీఎం ఎస్.బాలాజీ, మేనేజర్ ప్రసాద్, సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, పి.శేఖర్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రచారకుడికి సన్మానం



ప్రచారకర్త మోహిత్ నిరంజన్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కొమ్మాది: భవిష్యత్ తరాల వారు కాలుష్యం బారిన పడకుండా పుడమి తల్లిని కాపాడుకోవాలని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సైకిల్‌పై భారత్ యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల యువకుడు, పర్యావరణ ప్రచారకర్త మోహిత్ నిరంజన్‌ను భారత ప్రజా సంబంధాల సంఘం (పి.ఆర్.ఎస్.ఐ) ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా విశాఖ శాఖ చైర్మన్ ఎమ్.కె.వి.ఎల్.నర్సింహం మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రమాదకర క్రిమి సంహారకాలు వాడటం, పట్టణాల్లో ప్లాస్టిక్ వినియోగం, నదులను కలుషితం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు నిరంజన్ చేపడుతున్న కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నిరంజన్ మాట్లాడుతూ మనం తినే ఆహారంలో 95 శాతం మట్టి నుంచే వస్తుందన్నారు. భూమి పైభాగంలో 6 అంగుళాల మట్టిలో ఒక శాతం సేంద్రియ పదార్థాలు పెంచడం వల్ల ఎకరాకు 20 వేల గ్యాలన్ల నీటిని నిల్వ చేయవచ్చని తెలిపారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

తగరపువలస: నామమాత్రపు ఫీజులతో ఇంటర్మీడియట్, ఐఐటీ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్‌లలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తమ విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారని భీమిలి కేథరిన్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఇవాంజలిన్ రాయి అన్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆమె మాట్లాడారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులు, దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా ఎదిగి దేశానికి వెన్నుముఖగా నిలవాలన్నారు. ప్రిన్సిపాల్ కె.కె.నాయుడు మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియట్ మార్కులు, ఎంసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. వారిని మిగిలిన వారు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా 'ఈట్ రైట్ మేళా'



మిల్లెట్స్ మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎండీ భట్



వాకథాన్‌లో పాల్గొన్న ఉక్కు నగర వాసులు

- మిల్లెట్ మేళాలో ఆకట్టుకున్న స్టాల్స్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య స్పృహతో చిరుధాన్యాలకు డిమాండ్ పెరిగిందన్నారు. దైనందిన జీవితంలో మిల్లెట్స్ వినియోగం, ప్రాధాన్యం గురించి డాక్టర్ అరుల్ ఆనంద్, సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, క్యూ1 ఇంటర్నేషనల్ ఫుడ్స్ సీఈఓ ఎస్. సుజాత శ్రీనివాస్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి. రమణ, శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జి. సాంబశివరావు తదితరులు వివరించారు. మేళాలో సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మిల్లెట్లు, మిలెట్లతో చేసిన వంటకాలను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

ఉక్కు సెక్టార్లలో 'వాకథాన్'

ఈట్ రైట్ ఇండియా – 'సురక్షితంగా తినండి– ఆరోగ్యంగా తినండి– స్థిరంగా తినండి' నినాదంతో ఉక్కునగరంలో శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు.

సెక్టార్- 5 నుంచి సెక్టార్-1 మీదుగా అంబేడ్కర్ కళాక్షేత్రం గుండా సెక్టార్-6 వరకు వాకథాన్ సాగింది. అంతకు ముందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ బహుమతులు అందజేశారు.

ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న జ్యోతికుమారి

భీమునిపట్నం: విద్యార్థుల చదువు, పాఠశాలల అభివృద్ధి విషయంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు ఎం.జ్యోతికుమారి సూచించారు. ఇక్కడి సెడార్ పాఠశాలలో మూడు జిల్లాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించడంపై నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ శనివారం పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలలను మరింత మెరుగ్గా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మంచిగా బోధిస్తే శతశాతం ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, రాష్ట్ర పరిశీలకులు ఎస్.కల్పన పాల్గొన్నారు.

పురందేశ్వరిపై మండిపడ్డ అఖిలపక్షం

డాబాగార్డెన్స్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఆమె మాటలు వింటుంటే తెలుగు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా.. కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా మారినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. విశాఖ ఎంపీగా.. కేంద్ర మంత్రిగా పని చేసి విశాఖకు, ఆంధ్ర రాష్ట్రానికి ఏమీ చేయకపోగా.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ పంచన చేరి, ఆ పార్టీకి అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను ఏ ఒక్కటీ పూర్తి చేయకుండానే తప్పుడు ప్రచారానికి బీజేపీ నూతన అధ్యక్షురాలు పూనుకున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఇప్పటికైనా కపట నాటకాలు, అబద్ధాలు ఆపి విశాఖ రైల్వేజోన్ నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అటవీహక్కుల సంరక్షణ చట్టంలో సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా, లెక్క చేయకుండా బీజేపీ ఆమోదింపజేసిందన్నారు. దీంతో ఉత్తరాంధ్ర గిరిజనులు తీవ్ర ప్రమాదంలో పడ్డారని తెలిపారు. ఐదేళ్లలో రైల్వే జోన్‌కి ఎంత ఖర్చు పెట్టారు? ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా? అంటూ పురందేశ్వరికి బహిరంగ సవాల్ విసిరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకుడు వై.కొండయ్య, కె.శంకరరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.